# నిరీక్షణ

కథ

**- గన్నవరపు నరసింహమూర్తి**

**నేను మా ఊరు వెళ్లే రోజు దగ్గరపడుతోంది.అందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఎన్నాళ్లనుంచో ఎదురుచూస్తున్న రోజు. నేను ఆ ప్రాంతాన్ని వదలి అప్పడే పదిహేను సంవత్సరాలవుతోంది. చదువు పూర్తవగానే ఢిల్లీ దగ్గర నోయిడాలో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం రావడంతో మా ఊరుని వదలి ఇక్కడికొచ్చేశాను.**

**ఆ తరువాత ఈ పదిహేను సంవత్సరాల్లో మా ఊరు మూడుసార్లే వెళ్లాను. మొదటిసారి నా పెళ్లప్పడు వెళ్లాను. మా నాన్నగారికి ఒంట్లో బాగులేనప్పడు రెండోసారి వెళ్లాను. ఆ తరువాత నాన్నగారు చనిపోయినప్పడు ఆఖరిసారిగా వెళ్లాను.**

ఆయన పోయిన తరువాత ఇక చూసేవాళ్లు లేక ఉన్న పొలం, ఇల్లు అమ్మేసి మా అమ్మను నాతో నోయిడాకు తీసుకువచ్చాను. ఆ తరువాత ఎందుకో మా ఊరు వెళ్లబుద్ధికాలేదు. కానీ ఈ మధ్య ఎందుకో మా ఊరిని చూడాలన్న కోరిక బలంగా కలుగుతోంది. ఇప్పుడు నా వయస్సు నలభై దాటింది. మరికొన్నాళ్లైతే బహుశా నన్ను పోల్చుకునేవాళ్లు కూడా ఉండరేమో? అందుకే ఒక్కసారి వెళ్లి వాళ్లందర్నీ చూస్తే నా మనసుకి తృప్తిగా ఉంటుంది.

ఆ కోరిక విశాఖట్నంలో ఆఫీసు పని మీద వెళ్తున్నందువల్ల తీరబోతోంది. అక్కడికి మా ఊరు చాలా దగ్గర. రెండు గంటల ప్రయాణం. నేను మా ఊరు వెళ్తున్నందుకు అమ్మ ఎంతో సంతోషించింది. తప్పక వెళ్లి కాంతం అత్తను చూసి ఆమె యోగక్షేమాలు కనుక్కోమని చెప్పింది. వీల్లైతే ఆమెను తీసుకురమ్మంది. ఆమె అంటే అమ్మకు అంత అభిమానం. బయలుదేరే ముందు నా శ్రీమతి ప్రణవికి అన్న జాగ్రత్తలూ చెప్పి రైల్వేస్టేషన్‌కి చేరుకున్నాను. మరో గంటకి రైలు బయలుదేరింది. ఇప్పుడు నాలో ఎందుకో ఉద్విగ్నత చోటు చేసుకుంది. బహుశా చాలా రోజుల తర్వాత మా ఊరిని చూడబో తున్నందుకేమో?


నాకు బాల్యం గుర్తుకొస్తోంది.

* * *

మాది విశాఖపట్నం దగ్గర అందమైన పల్లె. పేరు బలరామపురం. ఏటి ఒడ్డున ఉండే మా చిన్న ఊరికి ఆ పేరే కంఠాభరణం. తెల్లారితే మొత్తం పల్లె అంతా ఆ ఏటి దగ్గరే ఉండేది. ఆ ఏటి ఒడ్డునే మా స్కూలు వుండేది. సాయంత్రం స్కూలు వదలగానే ఆ ఏటి ఇసుక తిన్నెల మీద కబాడీ ఆడితేగానీ ఇంటికి వచ్చేవాళ్లం కాదు. నాకు ఎందరో స్నేహితులున్నా భాస్కరంతోనే ఎక్కువ స్నేహం. దానికి కారణం భాస్కరం వాళ్లు మా పొరుగున ఉండేవాళ్లు. వాళ్ల నాన్న వ్యవసాయం చేస్తుండేవాడు. వాళ్లమ్మని మేము 'కాంతం అత్తా' అని పిలిచేవాళ్లం. కాంతం అత్త అంటే మా వీధంతటికీ భయమే. ఆమె చిన్న కిరాణా దుకాణం నడుపుతుండేది. ఇంటిని నాలుగు పోర్షన్స్‌గా విభజించి స్కూలు టీచర్లకు అద్దెకిచ్చేది. మా నాన్నగారు కూడా టీచరే కావడంతో మా ఇంటిపక్కన అద్దెకుండేందుకు చాలా మంది టీచర్లు మొగ్గు చూపడంతో ఆమె అద్దెని ప్రతీ సంవత్సరం పెంచుకుంటూ పోతుండేది.

కాంతం అత్త డబ్బు దగ్గర చాలా కచ్చితంగా ఉండేది. ఆ ఊర్లో చాలా మందికి ఆమె కిరాణా దుకాణంలో ఖాతా ఉండేది. సామాన్లు నెల మొత్తం తీసుకెళ్లి నెలాఖరుకి డబ్బు జమ చేసేవాళ్లు. ఎవరైనా డబ్బులు కట్టకపోతే వాడిని





బజారుకీడ్చేది. ఆమె నోటికి జడిసి అప్పు చేసైనా సరే డబ్బులిచ్చేవారు. అందుకు ఏం ప్రామిసరీ నోటు రాయించుకునేది కాదు. కేవలం నోటి మాట మీద ఇచ్చేది. అయినా డబ్బులు ఎలా వసూలు చెయ్యాలో ఆమెకు బాగా తెలుసు.

ఊరందరితో ఎలా వున్నా ఇరుగున వున్న మా కుటుంబంతో మాత్రం ఎంతో ఆప్యాయంగా ఉండేది. ముఖ్యంగా మా అమ్మంటే ప్రాణం. 'ఒదినా' అంటూ ప్రేమగా పిలిచేది. నన్ను మాత్రం 'ఏరా సూర్యం' అంటూ ఆప్యాయంగా నోరారా పిలిచేది. కాంతం అత్తకి నోట్లో నువ్వు గింజ దాగదని అందరూ అనుకునేవారు. సుఖం, దుఃఖం ఏదొచ్చినా ఆమెని పట్టలేం. ఏదైనా విషయం ఊరంతా తెలియాలంటే మాత్రం ఆమె చెవిని వేస్తే సరి! ఇక ఉత్తరక్షణంలో ఊరంతా తెలిసిపోయేది. వేరే చాటింపు అనవసరం. వాళ్లింట్లో ఏది చేసినా మాకివ్వంది ఉండేదికాదు. మా నాన్నకు వడ్డీ లేకుండా ఎన్నో మార్లు అవసరానికి అప్పిస్తుండేది. నిజంగా మా నాన్నగారిని స్వంత అన్నయ్యలా భావించేది.

ప్రతీ రోజూ జంతికలు, వడియాలు, పుణుకులు, జీళ్లు, కజ్జి ఉండలు చేసేది దుకాణంలో అమ్మడానికి. అప్పుడప్పుడు ఆమె లేనప్పుడు భాస్కరం దుకాణంలో కూర్చునేవాడు. వాళ్లమ్మ చూడకుండా జంతికలు. జీళ్లు దొంగతనంగా తెస్తే మేమిద్దరం ఏటి ఒడ్డున దొంగతనంగా తినేవాళ్లం. ఒకోసారి అలా దొంగతనం చేసి కాంతం అత్తకి పట్టుబడేవాడు కూడా. ఇక ఆ రోజు వాడికి బడితపూజే!

భాస్కరానికి ఎందుకో మొదట్నుంచి చదువంటే శ్రద్ధ లేదు. స్కూల్లో వాడికి సరిగ్గా మార్కులొచ్చేవి కావు. అంచేత కాంతమ్మత్త మా నాన్నగారి దగ్గరికి ట్యూషన్‌కి పంపేది. అయినా వాడు సరిగ్గా చదివేవాడు కాదు. వాడు సరిగ్గా

చదవకపోయినా సరే వాడితో స్నేహానికి మాత్రం మా ఇంట్లో అడ్డు చెప్పేవారు కాదు. దానికి కారణం కాంతమ్మత్త మా కుటుంబం పట్ల చూపే ప్రేమే అనుకుంటాను.

ఆ సంవత్సరం పదవతరగతి పరీక్షల్లో భాస్కరం తప్పాడు. ఇక కాంతమ్మత్త కోపం చూడాలి. రెండు రోజులు వాడికి అన్నం పెట్టలేదు. మా ఇంటికొచ్చి మా నాన్న దగ్గర ఒకటే ఏడుపు. వాణ్ణి ఎలాగైనా దారిలో పెట్టమని మా నాన్న కాళ్లావేళ్లా పడింది. మా నాన్నగారు వాడిని పగలూ, రాత్రీ చదివించి ఎలాగైతేనేం వచ్చే మార్చికి పాస్ చేయించారు.

అలా మళ్లీ మొదలైంది మా కాలేజీ జీవితం. నేను భాస్కరం దగ్గర్లోని బొబ్బిలిలో కాలేజీలో జాయిన్ అయ్యాం. రోజూ బస్సులో కాలేజీకెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేవాళ్లం. ఆ కాలేజీ రోజులు ఎంతో ఆనందంగా గడిచాయి. మేము మొత్తం ఇరవైమంది రోజూ కాలేజీకి వెళ్లేవాళ్లం. కాలేజీలో జాయిన్ అయిన తరువాత భాస్కరం పూర్తిగా చెడు వ్యసనాలకు అలవాటుపడ్డాడు. ఇంట్లో వాళ్లుగానీ, నేను గానీ ఎన్ని చెప్పినా వినేవాడు కాదు. దొంగతనంగా సిగరెట్లు కాల్చేవాడు. అమ్మాయిల వెంట తిరిగేవాడు. నన్ను మాత్రం ఇంట్లో చెప్పొద్దని బతిమాలేవాడు. రెండేళ్ల తరువాత ఇంటర్‌లో కూడా ఫెయిలయ్యాడు.

కాంతమ్మత్త కొడుకు చెడిపోతున్నందుకు దిగులు పడుతుండేది. రానురాను భాస్కరం వాళ్ల నాన్నకు ఆరోగ్యం క్షీణించసాగింది. పూర్తిగా మంచం పట్టేశాడు. ఎన్ని మందులు వాడినా ఫలితం శూన్యం. వ్యవసాయం కూడా మూలపడింది. కాంతమ్మత్త కిరాణాదుకాణాన్ని చాకచక్యంగా నడిపి ఇల్లుని నెట్టుకొస్తుండేది. భాస్కరం చదువు మానేసి ఇంటిపట్టునే ఉంటూ ఉండేవాడు.

ఈలోగా నాకు ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. కానీ నాన్నగారి ఆర్థిక పరిస్థితి బాగులేక ఫీజుకు ఇబ్బంది వస్తే కాంతమ్మత్త తన బంగారం తాకట్టు పెట్టి మరికొందరి దగ్గర అప్పులు వసూలు చేసి నా ఫీజుకి డబ్బులు సర్దుబాటు చేసింది. అలా నా చదువు కొనసాగడానికి కాంతమ్మత్త సహాయమే కారణం. ఆ విషయం నేనెప్పుడూ మరిచిపోలేను. ఆమె నిజంగా మా కుటుంబ శ్రేయోభిలాషి.

నేను ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు సెలవులకి ఇంటికొచ్చినప్పుడు కాంతమ్మత్త వాళ్లింటికి భోజనానికి పిలిచేది. అప్పుడు చెడిపోతున్న భాస్కరం గురించి చెప్పి, వాడికేదో తోవ చూపించమనీ అడుగుతుండేది. ఈలోగా వాడికి తాగుడు కూడా అలవాటైంది. ఈలోగా నా చదువు పూర్తవడం, నోయిడాలో ఉద్యోగం రావడంతో ఊరు వదలి వచ్చేశాను. కానీ ఆ మరుసటి సంవత్సరం మా నాన్నగారు రిటైరై చనిపోవడంతో చివరిసారిగా మా వూరెళ్లాను. అప్పటికి మా కాంతమ్మత్త భర్త ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆయన ఆపరేషన్ కోసం ఉన్న పొలంలో రెండెకరాలు అమ్మి వేసానని చెప్పింది. భాస్కరం ఊరి తగవులన్నీ ఇంటికి తెస్తున్నాడనీ చెప్పింది. భర్త అనారోగ్యం, కొడుకు మీద బెంగతో కాంతమ్మత్త చిక్కి శల్యమైపోయింది. ఆమెను చూస్తే నాకు జాలితోపాటే భయం వేసింది.

ఆ రోజు నేను మా అమ్మని తీసుకుని ఊరు విడిచి వెళ్లిపోతుంటే ఆమె ఒకటే ఏడుపు. అండగా ఉన్న ఒక్కగానొక్క కుటుంబం వెళ్లిపోతున్నందుకు ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది. అమ్మని అక్కడే వదిలేయమనీ, తను కంటికి రెప్పలా చూసుకుంటాననీ ఎంతో ఆప్యాయంగా చెప్పింది. కానీ అమ్మని తీసుకెళ్లక తప్పని పరిస్థితి నాది. ఆ రోజే నేను, మా అమ్మ నోయిడాకి వచ్చేశాం. అదే చివరిసారిగా మా ఊరికెళ్లడం. అప్పుడే పదిహేను సంవత్సరాలైపోయింది. అప్పుడప్పుడు నాకూ, అమ్మకు కాంతమ్మత్త కుటుంబం మరీ ముఖ్యంగా భాస్కరం గుర్తుకొస్తుంటారు. కానీ చాలా రోజులైంది. వాళ్ల విషయాలేవీ తెలియలేదు.

* * *

ఆ మర్నాడు విశాఖపట్నంలో దిగి మా బ్రాంచ్ ఆఫీసుకి వెళ్లాను. అక్కడ పని పూర్తయ్యేసరికి రెండు రోజులు పట్టింది. మర్నాడే మా ఊరికి బయల్దేరాను. పదిహేను సంవత్సరాల తరువాత మా ఊరు వెళ్తున్నందుకు నా మనసు చాలా ఉద్వేగానికి లోనవుతోంది. గంట తర్వాత టాక్సీ మా ఊరి పొలిమేరల్లో ప్రవేశించింది. కానీ ఎందుకో ఆ ప్రాంతం అంతా నాకు కొత్తగా అనిపించసాగింది. ఆ పరిసరాల్లో చాలా మార్పులొచ్చాయి. కొత్తగా రోడ్డు వేయడం వల్ల నాటు బండ్లు తగ్గిపోయి ఆటోలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మా గ్రామం ఆధునికతను సంతరించుకున్నట్టుంది. నన్ను ఎవరైనా ఊర్లో పోలుస్తారా అన్న సందేహం కలగసాగింది. ఎవరు పోల్చుకున్నా లేకపోయినా మా కాంతమ్మత్త మాత్రం తప్పక పోలుస్తుంది. ఆ ధైర్యంతోనే ఊళ్లోకి ప్రవేశించాను. టాక్సీ తిన్నగా ఆమె ఇంటి ముందే ఆగింది.

ఆ వీధంతా పూర్తిగా మారిపోయింది. మట్టిరోడ్డు స్థానంలో కాంక్రీటు రోడ్డు, కాలువలు, కాసేపటికి ఎవరో చెప్పడంతో కాంతమ్మత్త బయటికొచ్చింది. ఆమెను చూడగానే నాకు ఒక్కసారిగా ఏడుపు ముంచుకొచ్చింది. ఆమె రూపంలో, ఆకారంలో పెనుమార్పులు గమనించాను. ముడతలు పడిన శరీరం, వంగిన నడుముతో మనిషి బాగా చిక్కిపోయింది. నన్ను బాగా దగ్గర్నుంచి చూస్తేగాని పోల్చుకోలేక పోయింది. పోల్చుకున్న తరువాత నన్ను కావలించుకుని ఒకటే ఏడుపు. ఆమె ఆప్యాయమైన స్పర్శకి నాకు నోట మాట రాలేదు. కాసేపటికి తేరుకుని ఇంట్లోకి తీసుకెళ్లింది.

ఈ పదిహేను సంవత్సరాల్లో ఏం జరిగిందీ ఆమె చెబుతుంటే నేను శ్రోతనే అయ్యాను.

''ఒరేయ్ సూర్యం, మీ కుటుంబం ఈ ఊరు విడిచి వెళ్ళింతరువాత నా కష్టాలు ఏమని



## నన్ను వారితో ఎందుకు పోలుస్తారు?

ఒక సినిమా హిట్ అయితే ఆకాశానికి ఎత్తేయడం, ఫట్ అయితే వెనక్కి నెట్టేయడం సినీ రంగంలో సర్వసాధారణం. సినిమా విడుదల కాకముందే ఆఫర్లు రావడం కూడా మామూలు విషయమే. ఇవన్నీ ఒక ఎత్తయితే కొత్త తారను పాత తరం డ్రీమ్‌గర్ల్స్‌తో పోల్చడం అరుదుగా జరుగుతుంటుంది. ఇలాంటి అరుదైన సంఘటన ఆసిన్ విషయంలో జరిగింది. దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లిన ఆసిన్ నటించిన 'గజిని' బాలీవుడ్‌లో విడుదలకు ముందే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయింది. నిర్మాతలు ఆమెను హేమమాలిని, శ్రీదేవిలతో పోలుస్తూ ఆకాశానికి ఎత్తేస్తుండడం ఆసిన్‌కు కొద్దిగా ఇబ్బందిగా వుందట. హేమమాలిని, శ్రీదేవి ఇద్దరూ అసాధారణ ప్రతిభ వున్న హీరోయిన్లు. నిర్మాతలు నన్ను వారితో ఎందుకు పోలుస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. వారికి నాకు ఒకటే పోలిక. నాకు హిందీ వచ్చు కాబట్టి 'గజిని'కి నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. ఇక ముంబాయికి నా మకాం మార్చడంలో నా ఉద్దేశం వేరు. దక్షిణాదికి దూరం కావాలని ఎప్పుడూ అనుకోలేదు. సినిమాలే కాకుండా దాదాపు ఆరు పెద్ద కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వున్నాను. వారికి కూడా అందుబాటులో వుండాలి కాబట్టి ఇక్కడకి షిఫ్టు అయ్యాను. అవకాశం వచ్చినప్పుడల్లా తెలుగు, తమిళ సినిమాలలో నటిస్తూనే వుంటాను.

చెప్పుకోను? మీ మామ మీరు వెళ్లిపోయిన రెండు సంవత్సరాలకు చనిపోయాడు. మీ మావయ్య చనిపోయిన తరువాత భాస్కరంతో నేను ఎన్నో బాధలు పడ్డాను. ఊరు రాజకీయాల్లో, గొడవల్లో తల దూర్చి పోలీసు కేసుల్లో ఇరుక్కున్నాడు. వాణ్ణి ఊరి వాళ్లందరూ ద్వేషించినా తల్లిని కాబట్టి అందరి కాళ్లు పట్టుకుని బోలెడు డబ్బు ఖర్చు పెట్టి ఆ కేసులోంచి విడిపించాను. ఎంతైనా కన్నపేగు కదా!.. కానీ వాడిలో మార్పు మాత్రం తీసుకురాలేక పోయాను. పోనీ ఆ చదువు లేకపోతే పోయే! ఆ ఉన్న పొలాన్ని, ఈ దుకాణాన్ని చూసుకుంటే వాడి జీవితం హాయిగా గడిచిపోతుందని చెప్పాను. ఇంక ఇంటి అద్దెలు ఉండనే ఉన్నాయి. అయినా నా మాటలు వాడి చెవికెక్కలేదు!! చెబుతూ మధ్యలో ఆగింది. అక్కడ సూదిమొన పడితే వినిపించే టంతటి నిశ్శబ్దం. ఇంతలో ఆమె కంటనీరు గమనించాను. ఆమె ఏడుస్తోంది. ఏం చెయ్యాలో నాకు తోచలేదు. కాసేపటికి తేరుకుని మళ్లీ చెప్పడం మొదలుపెట్టింది. ఉన్నట్టుండి పదేళ్లక్రితం ఈ ఊరు విడిచి వెళ్లిపోయాడు. ఎవ్వరికీ చెప్పలేదు. వెళ్లిన కొన్ని రోజుల ముందు వాడిలో మార్పును నేను గమనించాను. ఎవ్వరితోనూ మాట్లాడేవాడు కాదు. గెడ్డాలు పెంచి పిచ్చివాడిలా తయారయ్యాడు. ఆ వెళ్లిపోవడం వెళ్లిపోవడం ఇప్పటిదాకా వాడి ఆచూకీ తెలియలేదు. వాడు క్షేమంగా తిరిగి రావాలనీ నేను మొక్కని దేవుడు లేడు, చెయ్యని పూజ లేదు''

''నీకు తెలుసు కదరా. నేను ఏం చేసినా, ఎంత సంపాదించినా అంతా వాడికోసమే. వాడు పెళ్లి చేసుకుని పిల్లాపాపల్తో హాయిగా ఈ ఇంటిని కనిపెట్టుకుని ఉండాలని ఎంతో ఆశపడ్డాను. అందుకోసం రాత్రనక పగలనక ఈ ఆస్థులు కూడబెట్టాను. కానీ నా ఈ అవసానదశలో కట్టుకున్న వాడు చనిపోయాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఎటో వెళ్లిపోయాడు. ఆ దేవుడు నాకీ వయసులో గర్భశోకం మిగిల్చాడు!!''

''ప్రతిరోజు వాడు వస్తాడనీ, కనీసం ఉత్తరం అయినా రాస్తాడనీ ఎదురుచూస్తుంటాను. అలాగే ఈ పది సంవత్సరాలు జీవచ్ఛవంలా గడిపాను'' చెబుతూ ఆమె వెక్కి వెక్కి ఏడవసాగింది.

చాలా రోజుల నుంచి ఆమెలో దాగివున్న దుఃఖం నన్ను చూడగానే ఏడుపు రూపంలో బయటకు వస్తోంది. అందుకే దాన్ని ఆపే ప్రయత్నమేదీ నేను చెయ్యలేదు. ఏడవనీ ఏడిస్తే పోయేది దుఃఖమేగా..

కాసేపటికి ఆమె మాములు మనిషయింది. మా అమ్మని ఎందుకు తీసుకరాలేదని నన్ను నిష్ఠూరమాడింది. ఈ సారి మొత్తం కుటుంబాన్ని తీసుకురమ్మంది. ఇక ఉన్న ఆ రెండురోజులూ నన్ను స్వంత కొడుకు కన్నా ఎక్కువగా చూసుకుంది. ఆమె ఆప్యాయత, ప్రేమల జడివానలో నేను తడిసి ముద్దైపోయాను. రెండు రోజుల తరువాత నేను నోయిడాకి భారమైన హృదయంతో తిరిగి వచ్చేశాను.

* * *

నేను మా ఊరి నుంచి వచ్చిన రెండు నెలల తరువాతనుకుంటాను ఒకరోజు ఢిల్లీ మిలట్రీ హాస్పిటల్ నుంచి మెసేజ్ వచ్చింది. '' ఎవరో నాకు సంబంధించిన పేషెంట్ చావు బతుకుల మధ్య ఉన్నాడని, వెంటనే కలవవలసిందిగా'' దాని సారాంశం. అది చూసిన నాకు ఆశ్చర్యం కలిగింది. ''నాకు తెలిసిన వారు ఎవరు? అందులోనూ మిలట్రీ హాస్పిటల్‌లో ఎందుకున్నారు?'' అన్న ప్రశ్నలు నాలో తలెత్తాయి. ఎన్నో సందేహాలతో బయలుదేరి మిలట్రీ హాస్పిటల్‌కి వెళ్లాను.

అక్కడికెళ్లిన తరువాత వాళ్లు నన్ను ఇంటెన్సివ్ కేర్‌కి తీసుకువెళ్లారు. అందులో బెడ్ మీద చావు బ్రతుకుల మధ్య ఉన్న భాస్కరాన్ని చూశాను. పదిహేను సంవత్సారాల తరువాత వాణ్ని ఇలా చూస్తాననుకోలేదు. నన్ను చూసి లేని ఓపిక తెచ్చుకుని కూర్చున్నాడు. ఏం జరిగిందో అని ఆశ్చర్యపోతున్న నాకు భాస్కరం జరిగింది చెప్పడం మొదలుపెట్టాడు.

''సూర్యం! నన్ను గుర్తుపట్టావు కదా? నేను రా..భాస్కరాన్ని'' ఎక్కడో నూతిలో నుంచి బయటకు వస్తున్నట్టున్నాయి అతని మాటలు. ఏం చెప్పాలో నాకు నోట మాటలు రావడంలేదు.


''మీరు ఊరు వదిలిన కొన్నాళ్ళకే మా నాన్న చనిపోయాడు. నేను నా అజ్ఞానంతో మా అమ్మని ఎన్నో ఇబ్బందులకు గురిచేశాను. ఆమెకి ఎక్కడలేని తలనొప్పులు తెచ్చిపెట్టాను. ఎన్నో తప్పులు చేసి పోలీసు కేసుల్లో ఇరుక్కున్నాను. అమ్మ భూదేవిలా అన్నీ సహించింది. నన్ను కంటికి రెప్పలా కాపాడింది. ఎందరి కాళ్లో పట్టుకుని ప్రాధేయపడి, డబ్బులు ఖర్చు పెట్టి నన్ను ఆ కేసుల నుంచి విముక్తుణ్ని చేసింది. నాకా వయసు మీద పడుతోంది. అమ్మ మాత్రం ఒంటరిగా ఎన్నాళ్లు నన్ను పోషిస్తుంది? ఆమె ఆరోగ్యం కూడా నా మీద బెంగ చేత రోజురోజుకి క్షీణించసాగింది. ఇక నేను అక్కడే ఉంటే ఆమెకి మరిన్ని కష్టాలు తప్ప సుఖం ఉండదన్న ఆలోచనకొచ్చాను. నాలో క్రమక్రమంగా మార్పు రాసాగింది. అందుకే ఒక రోజు ఎవరికీ చెప్పకుండా హైదరాబాద్ వచ్చేశాను. నేను లేకపోతే అమ్మ కొన్నాళ్లు బాధపడుతుంది. ఆ తరువాత కొన్నాళ్లకు అవన్నీ మర్చిపోయి సుఖంగా ఉంటుందన్న ఆలోచనతో వచ్చేశాను. హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా కొన్నాళ్ళు పనిచేసిన తరువాత మిలట్రీ సెలక్షన్స్‌కి వెళ్లి అందులో సెలక్టయ్యాను''

మధ్యలో ఆయాసం రావడంతో అతను చెప్పడం ఆపు చేసి నీళ్లు కావాలని అడిగాడు, నేను నర్సుని పిలిచి నీళ్లు తాగించాను. మళ్లీ కాసేపటికి చెప్పడం మొదలెట్టాడు.

''నాకు మొదటిసారి కాశ్మీర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. నేను జాయిన్ అయిన కొన్నాళ్ళకు కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన నాకు రాష్ట్రపతి పతకం లభించింది. నేను మా కుటుంబానికైతే ఎలాగూ పనికి రాలేదు కనీసం దేశం కోసమైనా ఏదైనా చెయ్యాలనీ ఈ ఎనిమిదేళ్లూ కష్టపడి పనిచేశాను''

''మరి నువ్వు మిలట్రీలో జాయినైనట్లు, నువ్వు కాశ్మీరులో ఉంటున్నట్లు మీ అమ్మకు ఉత్తరం వ్రాయలేకపోయావా? ఆమెని చూడాలని నీకు ఒక్కసారైనా అనిపించలేదా? నీకోసం ఆమె కళ్లల్లో ఒత్తులు వేసుకుని అక్కడ ఎదురుచూస్తోంది'' మధ్యలో కల్పించుకుని అడిగాను భాస్కరాన్ని. నాకెందుకో వాడు చేసిన పని నచ్చలేదు.

''లేదురా! ఉన్నన్నాళ్లు ఆమెను బాధపెట్టాను. నేను చేసిన తప్పులకు నేనే శిక్ష విధించుకున్నాను. నాలాంటి వాళ్లు అమ్మలాంటి వాళ్లకు కొడుకులుగా పుట్టే అర్హత లేదు. మరికొన్నేళ్లు పోతే వెళ్దాం అనుకున్నాను. కానీ ఇంతలో ఉపద్రవం ముంచుకొచ్చింది''



''మొన్న కరడుకట్టిన కాశ్మీర్ తీవ్రవాదులు కాశ్మీరులో ఒకేసారి తీవ్ర విధ్వంసం సృష్టించాలనీ తద్వారా దేశాన్ని అల్లకల్లోలం చేద్దామనీ పెద్ద కుట్ర పన్నారు. దాన్ని మా రెజిమెంట్ కనిపెట్టి వాళ్ల ఆచూకీ కనుగొని వాళ్ల మీద దాడిచేశాం. నలభై మంది తీవ్రవాదులు ఒకే భవనంలో దాక్కుంటే దాని మీద మేము ఎటాక్ చేశాం. ఆ దాడిలో ఐదుగురిని నేను చంపాను. చివరలో వెనుక నుంచి ఒక ఉగ్రవాది నా మీద విపరీతంగా కాల్పులు జరిపాడు. ముఖ్యంగా రెండు బుల్లెట్స్ నా గుండెల్లోకి దూసుకుపోయాయి. డాక్టర్స్ నన్ను ఢిల్లీ ఆసుపత్రికి హెలీకాప్టర్‌లో తీసుకువచ్చారు. కానీ ఇక్కడి డాక్టర్స్ నేను బతకడం కష్టం అన్నారు. తల్లిదండ్రులకు కబురుపెట్టమని చెబితే నాకెవరూ లేరని, ఒక్క స్నేహితుడే ఉన్నాడని నీ పేరు చెప్పాను''

అతను చెబుతుంటే నా కళ్లల్లో సన్నటి నీటి పొర. బయటకు రాబోతున్న కన్నీళ్లను ఆపు చేయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాను.

''సూర్యం! ఈ పరిస్థితుల్లో నాకు నీ కన్నా ఆప్తులెవరున్నారు చెప్పు? నాకు బాగా తెలుసురా అమ్మ నా గురించే బ్రతుకుతోందని! అటువంటిది ఇప్పుడు నేను చనిపోతున్నానన్న విషయం తెలిస్తే మా అమ్మ తట్టుకోలేదురా'' భాస్కరం ఏడుస్తు న్నాడు, కంట్లోంచి నీళ్లు ధారాపాతంగా కారు తున్నాయి.

''సూర్యం! పుట్టుకతోనే ఎవ్వరూ చెడ్డవారు కారురా. కొన్ని పరిస్థితుల ప్రభావంతో అలా తయారవుతారు. అందుకు ప్రత్యక్షసాక్షిని నేనే. పుట్టిన తరువాత తన చేష్టలతో తల్లిదండ్రుల్ని బాధపెట్టిన నాలాంటి కొడుకులు నాలాగే అర్ధాంతరంగా తనువు చాలిస్తారు. అందుకు నేనే ఓ ఉదాహరణ''

''భాస్కరం! నువ్వు అలా బాధపడొద్దు. నేను ఈ మధ్యనే మన ఊరు వెళ్లి మీ అమ్మని కలిశాను. ఆమె నీ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తోంది. నీ మీద ఆమెకు ఏ విధమైన కోపం లేదు. ఆ ఇల్లూ, ఆస్తులూ నీకు అప్పచెప్పి నీ దగ్గరే తన శేషజీవితం గడిపేయాలనీ ఆమె కోరిక. కానీ మధ్యలో నీకిలా జరిగింది. ఈ విషయం అత్తకు తెలిస్తే? ''

''ఒద్దురా! విషయం అమ్మకి తెలియనివ్వకు. నేనెక్కడో బతికే ఉన్నానన్న ఊహలో ఆమెని తృప్తిగా బ్రతకనీ. ఈ వయసులో చెట్టంత కొడుకు చనిపోయాడని తెలిస్తే మా అమ్మ ఇంక బ్రతకదు. అందుకే ఈ వయసులో ఆమెకు గర్భశోకాన్ని కలిగించి మరింత పాపం చెయ్యలేను. అందుకే ఆమెకీ విషయం తెలియపరచకుండా నీకు కబురు పంపాను. ఈ సమయంలో నిన్ను బాధపెడు తున్నందుకు నన్ను క్షమిస్తావు కదూ!''


''అయితే నాకు ఒక్క విషయంలో మాత్రం గర్వంగా ఉందిరా. నేను నా దేశాన్ని రక్షించే ప్రయత్నంలో చనిపోతున్నందుకు గర్వంగా ఉందిరా. నా కన్నతల్లికి నేను నా జీవితంలో ఏమీ చెయ్యలేకపోయినా నాదేశమాత కోసం నా ప్రాణాలర్పిస్తున్నందుకు నాకెంతో తృప్తిగా వుంది'' అంటూ తల వాల్చేశాడు.

తను చనిపోయాడన్న విషయం వాళ్లమ్మకు చెప్పొద్దని మాట తీసుకున్నాడు భాస్కరం. ఆ విషయం తెలియని ఆ పిచ్చితల్లి చనిపోయేదాకా భాస్కరం కోసం నిరీక్షిస్తూనే ఉంటుంది. అంతులేని నిరీక్షణ...

ఆ ఆలోచన రాగానే అంతవరకు బలవంతంగా ఆపుకున్న కన్నీళ్లు ఒక్కసారిగా ఉబికి వచ్చాయి నాకు. ఆ దృశ్యాన్ని చూడలేక భారమైన హృదయంతో బయటకు వచ్చాను.

❑

# సదా మీకందుబాటులో... అమితాబ్!



''స్టూడియోకి వెళ్తున్నాను. ట్రాఫిక్. నాల్గింటిలోగా సీన్ పూర్తి చేయాలి. తర్వాత ఫ్లైట్ ఎక్కాలి. ప్రస్తుతం కారులో కూర్చుని పేపర్ వర్క్ పూర్తి చేస్తున్నాను. ఏదీ రాయడానికి కష్టంగా ఉంది. ఉంటాను. ప్రేమతో''– జూన్ 20, 9:30 am.

''ముంబైలో లాండ్ అయ్యాను. సౌ.బొ. లో డెంటిస్ట్ దగ్గరకు వెళ్తున్నాను. సౌ.బొ అనాలా లేక సౌ.ము. అనాలా? అంటే– సౌత్ బొంబాయా లేక సౌత్ ముంబాయా? దారుణమైన ట్రాఫిక్. ప్రస్తుతం పేపర్ వర్క్‌లో ఉన్నాను. మిగతాది తర్వాత మాట్లాడుకుందాం. బై. ప్రేమతో.''– జూన్ 23, 9:30 am.

ఇవేవో ఒక ఫ్రెండ్ మరొక ఫ్రెండ్‌కి పంపుకున్న SMS లనుకుంటున్నారా? కాదండీ! ఇవి సాక్షాత్తూ బిగ్ బి అమితాబ్ బచ్చన్ తన అశేష అభిమాన జనానికి పంపిన 'బ్లాగు' సందేశాలు. అమితాబ్‌కు ఒక సొంత బ్లాగుందన్న సంగతి చాలా మందికి తెలిసిందే (bigb.bigadda.com). ఆయన తన అభిప్రాయాలు, తన అభిమానుల ప్రశ్నలకు సమాధానాలు అన్నీ ఇందులో ఉంచుతారు. అంతేకాదు, ఇపుడు ఈ బ్లాగుకు మొబైల్ ఫోన్ నుండి అప్‌డేట్ చేసే సదుపాయం కూడా జత కావడంతో ఆయన షూటింగ్‌లో ఉన్నా, ట్రాఫిక్‌లో ఉన్నా, ఇంట్లో ఉన్నా, ఆఫీస్‌లో ఉన్నా– ఎప్పుడైనా, ఎక్కడ్నుంచైనా తన అభిమానుల సెల్ ఫోన్ నుండి సందేశాలు పంపే సౌలభ్యం కలిగింది. ప్రస్తుతం ఈ బ్లాగుకు పదహారు వేలమందికి పైగా వీక్షకులు ఉన్నారు. అమితాబ్ మాత్రమే కాదు; అమీర్ ఖాన్, శిల్పా శెట్టి, బిపాసా బసు, నందితా దాస్, శేఖర్ కపూర్ మొదలైన బాలీవుడ్ ప్రముఖులందరూ బ్లాగ్స్ ద్వారా తమ అభిమానులకు చేరువౌతున్నారు. ఇలాచేయడం వల్ల అభిమానులు తమ గురించి, తమ సినిమాల గురించి ఏమనుకుంటున్నారో నిక్కచ్చిగా తెలుస్తుందనీ, అలాగే తాము తమ అభిమానులకు ఏం చెప్పాలన్నా మధ్యలో ఎటువంటి పత్రికల వక్రీకరణలూ లేకుండా సూటిగా వారితోనే సంభాషించే సౌలభ్యం ఉంటుందనీ వారి భావన. సమాచార విప్లవం జిందాబాద్!